**పత్రికాప్రకటన** **కాకినాడ, 11.11.2018**

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మైనారిటీ వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకుని అన్ని రంగాల్లో రాణించాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు కోరారు.

ఆదివారం భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ 130 జయంతి పురస్కరించి మైనారిటీ సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవాలను స్థానిక సంతచెరువు సమీపంలోని సీరత్ కమిటీ ఫంక్షన్‌హాలులో జిల్లా మైనారిటీల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక శాసన సభ్యులు వనమాడి వెంకటేశ్వరరావు ముఖ్య అతిధిగాను, జాయింట్ కలెక్టర్-2 సిహెచ్.సత్తిబాబు విశిష్ట అతిధిగాను హాజరై మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు అలంకరించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరంలోను, స్వాతంత్ర్యానంతరం దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా విద్య, శాస్త్ర సాంకేతక రంగాల అభివృద్ధికి అబుల్ కలామ్ అజాద్ చేసిన సేవలను జాతి ఎన్నటికి మరువదన్నారు. అన్ని మతాల ఐక్యతతో కలిసి ఉంటేనే దేశాభివృద్ధి సాధ్యమని చాటి, అందుకు జీవితాంతం కృషిచేసిన మహనీయుడని అజాద్‌ను కొనియాడారు. మైనారిటీల వర్గాల ప్రజల విద్య, ఆర్ధికాభ్యుదయానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని, వాటిని ఆయా వర్గాలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జాయింట్ కలెక్టర్-2 సిహెచ్.సత్తిబాబు మాట్లాడుతూ మైనారిటీ సంక్షేమ దినోత్సవం సందర్భంగా ఆ వర్గాల ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. దేశ రాజకీయ, విద్యా రంగాలలో మౌలానా అబుల్ కలామ్ తనదైన చెరగని ముద్ర వేశారని, ఆయన ఉన్నత ఆశయాలు, దేశభక్తి నేటి తరానికి ఆచరనీయ ఆదర్శాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యక్తి పుట్టిన నాటి నుండి పుడకల దాకా చేరే జీవన ప్రస్థానం ప్రతి స్థాయిలోను ఏదో ఒక సంక్షేమం అమలు చేస్తోందని, మైనారిటీ ప్రజలు ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముస్లిం యువతకు వివిధ నైపుణ్యాలలో శిక్షణ కల్పించి ఉపాధి అవకాశాలు, స్వయం ఉపాధి రుణాలు అందించడం జరుగుతోందన్నారు.

మైనారిటీ కార్పొరేషన్ ఈడి ప్రభాకరరావు, మైనారిటీ సంక్షేమాధికారిణి సునీత అల్పసంఖ్యాక సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, ఉపాధి, శిక్షణా కార్యక్రమాలను వివరించారు. అలాగే అబుల్ కలామ్ అజాద్ జీవిత విశేషాలతో రూపొందించిన లఘు చిత్రాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో మేవా సంస్థ అధ్యక్షులు ఇక్బాల్ ఆలీ, పెద్దమసీదు ప్రెసిడెంట్ ఎస్.ఇజాజుద్దీన్, ముస్లిం పెద్దలు ఖాన్, తాజుద్దీన్, సయ్యద్, అజ్జు,కార్పొరేటర్ తాహిరా ఖాతూన్ ప్రసంగించారు. మేవా కార్యదర్శి ఎం.ఏ.దీన్ నిర్వహించిన షాయరీ సభికులను అకట్టుకుంది.

కార్యక్రమంలో కుట్టు నైపుణ్యంలో శిక్షణ పొందిన 34 మంది ముస్లిం యువతులకు మైనారిటీ సంక్షేమ శాఖ ద్వారా కుట్టుమిషన్లను, మేవా సంస్థ పేద ముస్లిం విద్యార్థులకు అందించిన ఆర్ధిక సహాయాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అలాగే మైనారిటీ సంక్షేమ దినోత్సవం పురస్కరించి కళాశాల విద్యార్థులకు నిర్వహించిన వక్తృత్వ, వ్యాస రచన పోటీలలో విజేతలకు బహుమతులు, ఉత్తమ ఉర్ధూ ఉపాధ్యాయులకు పురస్కారాలను అందించారు. అంతకు ముందు 34 డివిజన్‌లో ముస్లిం ప్రజలు అధికంగా నివసించే సూపర్‌బజార్ రోడ్, శేషబ్ వీధి, షరీఫ్ వీధి, పెంటాసాహేబ్ వీధిలలో 8 లక్షల నిధులతో సిసి డ్రైన్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.

ఈ కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు ఇన్స్‌పెక్టర్ బాషా, కోఆప్షన్ సభ్యులు మెహరున్నీసా, పలువురు కార్పొరేటర్లు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

**పత్రికాప్రకటన** **కాకినాడ, 11.11.2018**

## 12వ తేదీ సోమవారంనాడు మీకోసం ప్రజావాణి రద్దు.

ఈ నెల 12వ తేదీ సోమవారంనాడు జిల్లాలోని డివిజన్ కేంద్రాల్లో వివిధ కార్పొరేషన్ల ఆధ్వర్యంలో మెగా లోన్ మేళాలు నిర్వహిస్తున్నందున ఆ రోజు కాకినాడ కలక్టరేట్‌లో జరిగే మీకోసం ప్రజావాణి కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు కలక్టర్ కార్తికేయ మిశ్రా తెలిపారు. 12వ తేదీ సోమవారంనాడు జిల్లాలోని డివిజన్ కేంద్రాల్లో జరిగే మెగా లోన్ మేళాలలో వివిధ శాఖల అధికారులు పాల్గొననున్నందున మీకోసం ప్రజావాణి రద్దు చేసామన్నారు.

(సమాచార శాఖచే జారీ)